క్లుప్తంగా

25న కనిగిరిలో జాబ్‌మేళా

కనిగిరిరూరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25న సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 8 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, పదో తరగతి నుంచి పీజీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8008822821 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పి-4 పథకానికి 280 కుటుంబాలు గుర్తింపు

సింగరాయకొండ: మండలంలోని పి-4 పథకం కింద 280 బంగారు కుటుంబాలను గుర్తించగా 116 మంది మార్గదర్శకులను ఎంపిక చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ జీవీ కృష్ణారావు తెలిపారు. బంగారు కుటుంబాల ఎంపికలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 5 నిబంధనలు ప్రామాణికంగా తీసుకుని ఎంపిక చేశామన్నారు. పింఛన్, గ్యాస్ కనెక్షన్, విద్యుత్ మీటర్, బ్యాంకు ఖాతా, ఆదాయం లేని వారిని ఎంపిక చేశామని వివరించారు. ఎంపిక చేసిన జాబితాను ప్రభుత్వానికి పంపామని, త్వరలో పథకం అమలు చేస్తామని ఆయన వివరించారు.

యోగాలో జీహెచ్‌ఎస్ విద్యార్థిని సత్తా



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ, ఎస్‌ఎంసీ చైర్మన్

పామూరు: జిల్లాస్థాయి యోగా పోటీల్లో పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని వేల్పుల రజని సత్తా చాటి ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ, పాఠశాల హెచ్‌ఎం కోటిరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావులు విద్యార్థినిని అభినందించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన యోగా జిల్లాస్థాయి పోటీల్లో రజని సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

నల్ల రిబ్బన్లతో అంగన్‌వాడీల నిరసన



మాట్లాడుతున్న పీసీ కేశవరావు

కనిగిరి రూరల్: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 5జీ ట్యాబ్‌లు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నల్ల రిబ్బన్‌లతో నిరసన చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేసి, అనంతరం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సుగుణావతమ్మ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులుసుజాత, రవికుమారి, రజిని, సీత, సౌందర్య, మనో రంజిత, మాదవి, కొండమ్మ, రాజేశ్వరి, అన్నపూర్ణ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు

కొండపి: బైకును కారు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ముప్పవరంలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికుల తెలిపిన సమాచారం ప్రకారం.. పెరిదేపి గ్రామానికి చెందిన అంగలకుర్తి చిన్న పోలు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. వ్యాపార నిమిత్తం ముప్పవరం గ్రామానికి చేరుకున్నాడు. ఒక్కసారిగా బైక్‌తో కుడి వైపు తిరగడంతో అదే సమయంలో తాటాకులపాలెంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగేశ్వరరావు విధులు ముగించుకొని కొండపి నుంచి టంగుటూరు వైపు కారుతో వచ్చి ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న పెరిదేపి గ్రామానికి చెందిన చిన్న పోలు (55) పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో కొండపిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలులోని రిమ్స్‌కు తీసుకెళ్లారు.

పొగాకు ఉత్పత్తులతో నష్టాలపై అవగాహన

టంగుటూరు: పొగాకు ఉత్పత్తుల వాడితే కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్వీ సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం పోటీలు నిర్వహించి చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. 9వ తరగతి విద్యార్థిని జాహ్నవి, ఎనిమిదో తరగతి విద్యార్థి శ్యామ్ ప్రతిభ కనబరిచారని, వారికి టీటీఎఫ్‌ఈఐ సంస్థ ద్వారా బ్యాగ్స్ ఎంఈఓ మారుతి బాలాజీ చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు కె.మాధురి, నిర్మలాదేవి, సురేష్ పాల్గొన్నారు.

ఆటోవాలాలకు ఉచిత బస్సు దెబ్బ

- ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లు
- ఏడాదిగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోని సర్కార్
- కూటమి ప్రభుత్వ తీరుపై ఆటో కార్మికుల ఆగ్రహం



టంగుటూరు స్టాండ్‌లో బాడుగలు లేక ఖాళీగా ఉన్న ఆటోలు

టంగుటూరు:

డిగ్రీలు చదివినా ప్రభుత్వ ఉద్యోగాలు రాక కొందరు.. చదువు లేక మరికొందరు ఆటోలను నమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు.. ఆర్థిక స్తోమత లేక బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఆటోలు కొనుగోలు చేసుకుని నెలనెలా ఈఎంఐలు చెల్లిస్తూ మిగిలిన సొమ్మును కుటుంబాల పోషణకు మిగిల్చుకుంటున్నారు. మరికొందరు ఆటోలు అద్దెకు తీసుకొని నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. దీంతో ఆటోవాలాల ఉపాధికి బ్రేక్ పడింది. ఎన్నికల సమయంలో ఆటోవాలాలకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు.. గెలిచాక దాని ఊసే ఎత్తడం లేదు. ప్రభుత్వ నిర్ణయంపై ఆటో డ్రైవర్లు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ప్రభుత్వ నిర్ణయంతో ఆటో డ్రైవర్లలో ఆందోళన మొదలైంది. స్త్రీ శక్తి పథకం తమ ఉపాధి దెబ్బతీసేలా ఉందని భయపడుతున్నారు. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేశామని, ఇక నుంచి అప్పులు ఎలా తీర్చాలని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దాదాపు 13 వేలకుపైగా ఆటోలు ఉన్నాయి. ప్రత్యక్షంగా పరోక్షంగా వీటిపై ఆధారపడి జీవించే వారి సంఖ్య లక్షల్లో ఉంది.

14 నెలలైనా అమలు కానీ హామీ

తాము అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు ఏటా రూ.15 వేలు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఆర్థిక సాయంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని నమ్మబలికారు. అధికారం చేపట్టి 14 నెలలు అవుతున్నా ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. అమలు చేస్తామని స్పష్టమైన హామీ కూడా లేదు. దీనికి తోడు సంక్షేమ బోర్డు మాటే ఎత్తడం లేదు. తక్కువ వడ్డీతో ఆటోలకు రుణాలు ఇస్తామన్న హామీకి అతీగతి లేదు. స్త్రీ శక్తి పథకం అమలు చేయడంతో ఆటో కార్మికులు జీవనోపాధి దెబ్బ తింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలి:



ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు 50 నుంచి 60 శాతం మంది ఉపాధి కోల్పోయారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదు. ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఉపాధి కోల్పోతున్న కార్మికులకు నెలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలి. సహజంగా ఆటోల్లో ప్రయాణించే వారిలో 80 శాతం మంది మహిళలే. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో ఎక్కే వారే లేరు.

చుండి కోటేశ్వరరావు, ఆటో డ్రైవర్, జయవరం

హామీలు అమలు చేయడం లేదు:



కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం చేస్తామన్న హామీ అమలు కాలేదు. ఆటో కార్మికులు ఏడాదిగా అనేక ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదు. రుణాలు ఇవ్వలేదు. ప్రభుత్వం తక్షణమే ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసి కార్మికులను ఆదుకోవాలి.

ఇత్తడి వినోద్‌కుమార్, ఆటో డ్రైవర్, టంగుటూరు

ఉచిత బస్సుతో తీవ్ర నష్టం:



మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోవాలాలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆటోల్లో మహిళలే అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. వారికి ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో వాలాలకు తీవ్ర నష్టం జరుగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి ఆటోవాలాలను ఆదుకోవాలి. మహిళలు ఆటోల్లో ప్రయాణించక పోవడంతో డ్రైవర్లకు రోజువారీ ఖర్చులు కూడా రావడం లేదు.

యాకోబు, ఆటో డ్రైవర్, కొండపి

నాగమ్మకు మాజీ మంత్రి సురేష్ నివాళి



నాగమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్



మాలకొండయ్యకు నివాళులర్పిస్తున్న సురేష్, డాక్టర్ వెంకయ్య

కొండపి: మండలంలోని ముప్పవరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాదాల సుబ్బారావు మేనత్త నాగమ్మ బుధవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం ఉదయం ముప్పవరం గ్రామానికి చేరుకొని నాగమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నాయకుడు మాదాల సుబ్బారావును ఓదార్చారు. పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, సీనియర్ నాయకుడు మండవ మాల కొండయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీరవసంతరావు, హరిబాబు, ఎంపీటీసీ మాదాల మాధురి పాల్గొన్నారు.

దశదిన కర్మకు హాజరైన మాజీ మంత్రి సురేష్

పొన్నలూరు: పొన్నలూరు మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కంచర్ల మాలకొండయ్య దశదిన కర్మకు ఆ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాలకొండయ్య చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఆర్‌టీఐ విభాగం కార్యదర్శి పిల్లి తిరుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి కాటా మాధవరావు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు గడ్డం మాల్యాద్రి, కాటా మల్లికార్జున, దాసరి రవి, జ్యేష్ఠ వేణు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పామూరు: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలి సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు కొమ్మలపాటి మాల్యాద్రి, అంగన్‌వాడీల సంఘ నాయకురాలు రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాయం వద్ద గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కె.మాల్యాద్రి, అంగన్‌వాడీల సంఘ నాయకురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ 42 రోజుల పాటు సమ్మె, పోరాటాలు చేసి పొందిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోగా యాప్‌ల భారం పెంచిందన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌లను రద్దు చేయాలని పోరాటాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావుకు అందజేశారు. వంకేశ్వరం నాగవాణి, పార్వతి, రమీజా, అమల, రజియా, రామసుబ్బులు, అనిత, వై.వీరనారాయణ పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



పామూరు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

పామూరు: సచివాలయ సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. పామూరు 3వ సచివాలయం, 4వ సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాయాల రికార్డులు, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సచివాలయా పరిధిలో జరుగుతున్న వివిధ సర్వేలు, ఈకేవైసీ, వర్క్‌ఫ్రం హోం, ఎన్‌పీసీఐ మొదలైన వాటిపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే వారిని పని పూర్తి చేసేందుకు పదే పదే తిప్పుకోవద్దని సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. విధుల్లో అలసత్వాన్ని సహించమన్నారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు గవిరెడ్డి అరవిందారెడ్డి, టి.వెలుగొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రవీంద్రబాబు

కనిగిరి రూరల్: ఒంగోలు వేదికగా జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వై రవీంద్రబాబు అన్నారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో గురువారం జరిగిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడారు. వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కల్గిన సీపీఐ తొలిసారిగా రాష్ట్ర మహాసభలను ఒంగోలు నగరంలో జరుపుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంక్షేం కొరవడిందని.. దోపిడీ పెరిగిందని తీవ్రంగా దుయ్యబట్టారు. రైతు కనీస మద్దతు ధర లేక, పండించిన పంటను అమ్ముకోలేక కష్టాల్లో కూరుకుని పోయాడన్నారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులు చొరబడి భ్రష్టు పట్టిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. దేశ ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం పేదల పక్షాన సీపీఐ ఎనలేని పోరాటాలు సాగించిందన్నారు. సీపీఐ పార్టీ చేసే ప్రజా పోరాటాల్లో రైతు, కూలీ, శ్రామిక, విద్యార్థి, యువత, కార్మిక, కర్షక, అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 23న ఒంగోలులో వేలాది మందితో ప్రజా ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి పందిటి మోహన్, మండల సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్, రైతు సంఘ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, వివిధ సంఘాల నాయకులు పవన్ కళ్యాణ్, ఖాశింపీరా, రామయ్య, ఇఫ్రాజ్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తీసుకురావాలి



వేలాన్ని పరిశీలిస్తున్న రీజనల్ మేనేజర్ రామారావు

టంగుటూరు: మార్కెట్‌కు అనుగుణంగా రైతులు పొగాకు బేళ్లు తీసుకుని రావాలని రీజనల్ మేనేజర్ శీలం రామారావు అన్నారు. గురువారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో జరుగుతున్న వేలం ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చేటప్పుడు తేమ లేకుండా చూసుకోవాలన్నారు. 2025-26 పంటకాలానికి బోర్డు అనుమతించిన మేరకు పొగాకు సాగు చేయాలని, బ్యారన్ కౌలు, పొలం కౌలు అధిక రేట్లకు తీసుకోవద్దని తెలిపారు. కమర్షియల్ నారుమడి సాగు చేసే వాళ్లు బోర్డులో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడు సంవత్సరాలకు కలిపి ఒకేసారి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, వాటిని రైతుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంపెనీ వ్యాపారులతో సమావేశమై అన్ని రకాల గ్రేడ్లను కొనుగోలు చేయాలని, రైతులు తీసుకొచ్చిన బేళ్లన్నింటినీ నోబిడ్స్ లేకుండా సరాసరి ధరతో కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.287

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.287 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 841 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. 620 బేళ్లు కొనుగోలు అయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 221 బేళ్లను తిరస్కరించారు. పొగాకు కనిష్ట ధర కేజీ రూ.140, సరాసరి ధర కేజీ రూ.255.67గా నమోదైంది. వేలంలో 12 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితాలో ఉన్న భూమిని తొలగించాలి

- అసిస్టెంట్ కమిషనర్‌కు విజ్ఞప్తి



ఏసీ పానకాలరావుతో మాట్లాడుతున్న గ్రామస్తులు

మద్దిపూడి: మండల కేంద్రం మద్దిపూడి నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగించాలని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం. పానకాలరావుకు గ్రామస్తులు విన్నవించారు. పృధులగిరిపై వేంచేసిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని అయన గురువారం దర్శించుకుని పూజలు చేశారు. గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మద్దిపూడికి సంబంధించి సర్వే నంబర్ 547లో 43.25 ఎకరాల గ్రామకంఠం భూమి ఉంది. గ్రామమంతా ఆ సర్వే నంబర్‌లోనే అనాదిగా విస్తరించి ఉందన్నారు. 2014లో నిర్వహించిన మీ భూమి గ్రామసభలో దేవదాయ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దాదాపు 1200కి పైగా నివాస గృహాలు ఉన్న మద్దిపూడి గ్రామకంఠం భూమిని 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. కేవలం 40 సెంట్లు భూమిలో పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి, రాధా రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి దేవాలయాలు నిర్మించి ఉంటే ఆ 40 సెంట్లను సబ్ డివిజన్ చేయకుండా గ్రామం మొత్తాన్ని నిషేధిత జాబితాలో చేర్చడంతో క్రయవిక్రయాలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తొలుత తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే సబ్‌డివిజన్ చేస్తారని, ఆ తర్వాత కమిషనర్‌తో మాట్లాడి నిషేధిత భూమి నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాల పరమేశ్వరి అమ్మవారి ఆలయ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎండోమెంట్ డీఈ శ్రీనివాసులు, ఏఓ నారాయణరెడ్డి, లీలాకృష్ణ, స్థపతి, డి. పరమేశ్వరప్పా, వేణు, సత్యనారాయణ, గ్రామస్తులు ఉన్నారు.

ఒక్క రోజే 414 బేళ్ల తిరస్కరణ

- పెరిగిన గరిష్ట ధర
- అన్ని బేళ్లూ కొనుగోలు చేయాలంటున్న రైతులు



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పదో రౌండ్ మధ్యలోకి వచ్చిన బేళ్లు కొనుగోలు చేయకుండా వ్యాపారులు తిరస్కరించారు. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక బేలును ఇంటి నుంచి వేలానికి తీసుకొచ్చి మళ్లీ తీసుకెళ్లేందుకు దాదాపు 2 వేల వరకు ఖర్చు అవుతుందని వాపోతున్నారు. అసలే గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతుంటే బేళ్లను కొనుగోలు చేయకుండా తిరస్కరించడం అన్యాయమంటున్నారు. దాదాపు రెండు నెలల నుంచి గరిష్ట ధర రూ. 280 ఉండగా కంటి తుడుపు చర్యగా గురువారం ఏడు రూపాయలు పెంచారన్నారు. పొగాకు వేలం కేంద్రాన్ని అధికారులు సందర్శించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించుకుంటున్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 414 బేళ్లు తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని గుర్రప్పడియా, మూగచింతల, కె.అగ్రహారం నెన్నూరుపాడు, చతుకుపాడు గ్రామాలకు చెందిన రైతులు 1262 బేళ్లు వేలానికి తీసుకొచ్చారు. అందులో 848 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 414 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.287, కనిష్ట ధర కేజీ రూ.140, సరాసరి ధర కేజీ రూ.250.92గా నమోదైంది. వేలంలో 14 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

సీఎస్‌పురం(పామూరు): రైతులు తాము సాగుచేసిన పంటలకు విధిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏడీఏ షేక్.జైనులబ్దిన్ అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం ఆయన వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై రైతులకు, వీఏఏలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఆధార్ నంబర్ పట్టాదారు పాసుపుస్తకం లింక్ చేసుకునేందుకు స్థానిక రైతుసేవాకేంద్రంలో సంప్రదించాలని సూచించారు. క్రాప్ ఇన్సూరెన్స్ కింద కంది, సజ్జ, మినుము, వరి, ఎర్రమిరప నోటిఫైడ్ క్రాప్స్‌కు ప్రీమియం కట్టుకోవచ్చన్నారు. రైతులు ఈ నెల 31వ తేదీలోగా పంటలకు ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, ఎంపీటీసీ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, చావా చంద్రశేఖర్, వీఏఏలు పాల్గొన్నారు.

పంటల దిగుబడికి నానో యూరియా వాడాలి

కొండపి: పంటల దిగుబడి పెంచేందుకు, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నానో యూరియా సాయ పడుతుందని గ్రోమోర్ మార్కెటింగ్ మేనేజర్ గోపి అన్నారు. గురువారం మండలంలోని పెట్లూరులో గ్రోమోర్ ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీపీఏపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ మేనేజర్ గోపి మాట్లాడుతూ ఇది సంప్రదాయ యూరియా కంటే తక్కువ మొత్తంలో అవసరమవుతుందని, రవాణ, నిల్వ చేయడం సులభమన్నారు. నానో యూరియా వాడితే ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. పంటలకు అవసరమైన పోషకాలు సమర్థంగా అందించి అధిక దిగుబడి సాధించేందుకు సాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, పూర్ణ, రాహుల్, చందు, రైతు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కనిగిరి రూరల్: సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేసి ప్రజల మన్నలను పొందాలని మున్సిపల్ కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఇందిరాకాలనీ, శంఖవరం సచివాలయాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే ప్రజలతో, అర్జీదారులతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజలు తెలిపే సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణ సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, బాధ్యతారాహిత్యంగా వ్యహరించినా సహించేది లేదన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఫీల్డ్ విజిట్‌కు వెళ్లి వచ్చిన అర్జీల ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. ఫీల్డ్ వెళ్లేటప్పుడు కచ్చితంగా మూమెంట్ రిజిస్టర్‌లో పొందుపర్చాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్నా, విధులకు డుమ్మా కొట్టినా తక్షణ చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న గ్రామస్తులు

పీసీపల్లి: మండల పరిధిలోనే చిన్న వరిమడుగులో నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం మూడో రోజు కనులపండువగా సాగింది. విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భ పూజ, ప్రతిష్టా హోమాలు, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ధ్వజప్రతిష్ట, శిఖర కళా ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, బలి హరనము, గోదర్శనం, డింబ దర్శనం, జ్వాల దర్శనం, శిఖర కలస కుంబాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు భైరవకోనలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ఉదయం 10 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. సామూహిక వ్రతాలకు కావాల్సిన పూజా సామగ్రిని ఆలయం వారు అందజేస్తారని పేర్కొన్నారు.